సాక్షి శ్రీకాకుళం

శనివారం ; 28 ; డిసెంబర్ ; 2024



పట్టుకోలేరా..?

ఒడిశా నుంచి సారా ఆంధ్రాలోకి వస్తోంది. సరిహద్దు గ్రామాల్లో రవాణా జరుగుతోంది.

- 8లో



బ్యాంకు రశీదులు ఫోర్జరీ

టెక్కలిలో సీఎఫ్ చేతివాటం వెలుగు చూసింది. ఫోర్జరీ రశీదులు బయటపడ్డాయి.

- 8లో

ఖాదీలో యువతను ప్రోత్సహించాలి

పొందూరు: ఖాదీ రంగంలో యువతను ప్రోత్సహిస్తే పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కమిషనర్, సీనియర్ ఐఏఎస్ కె.శారదాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఖాదీ దుకాణాన్ని ఆమె శుక్రవారం సందర్శించి ఖాదీ వస్త్రాలను పరిశీలించారు. కార్మికుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. కమిషనర్ శారదా దేవితో పాటు సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, మేనేజర్ వీవీ అప్పలనాయుడు ఉన్నారు.

ఆగ్రహ జ్వాల

భారం మోపడం దారుణం

ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు భారం మోపడం దారుణం. పెంపు ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలి. సంపద సృష్టి పేరుతో ఇలా దోచుకోవడం అన్యాయం. ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు గత ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అడ్డగోలు దోపిడీ

చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా అడ్డగోలుగా దోపిడీ జరుగు తుంది. సూపర్ సిక్స్ అమలు చేయకుండా బాదుడు అనే పథకం అమలు చేస్తున్నారు. చంద్రబాబు కేవలం రెండు నెలల్లో యూనిట్‌కు రూ.3 పెంచారు.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

చలిలో చెమట్లు పట్టిస్తున్నారు..

పాలకులు ప్రజలకు చలికాలంలోనూ చెమట్లు పట్టిస్తున్నారు. రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి విద్యుత్ వినియోగదారులపై ఆరు నెలల కాలంలో ఇంత భారం వేయలేదు. ఎస్సీ ఎస్టీ లకు 200 యూనిట్లు ఫ్రీగా అందించాలి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

ఇది మోసం

తమ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఐదు నెలల్లోనే రూ.15వేలకోట్లకుపైగా భారం మోపారు. ఇది ప్రజలను మోసం చేయడమే. ఎన్నికల ముందు హామీలకు పాలనకు సంబంధం లేకుండా పోయింది.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

పాతపట్నం



విద్యుత్‌శాఖ ఏఈ రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

పలాస



విద్యుత్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సోంపేట



ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు

విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసనల నిప్పు

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రజల్లో గూడుగట్టుకున్న ఆగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఓ వేదికనిచ్చింది. విద్యుత్ చార్జీల పెంపుపై జనాల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆవేదనను బయటకు చెప్పుకునేందుకు పోరుబాటను చూపించింది. విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ నిర్వహించిన పోరుబాటతో నియోజకవర్గ కేంద్రాలు దద్దరిల్లాయి. కూటమి సర్కారుపై జనాలకు ఉన్న ఆగ్రహానికి పార్టీ నాయకుల పోరాటం తోడు కావడంతో అన్ని చోట్లా కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గాల కేంద్రాల్లో నిరసనలు
- చంద్రబాబు బాదుడుపై పెల్లుబికిన ఆగ్రహజ్వాల



నరసన్నపేటలో ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలుపుతూ..

పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నరసన్నపేటలోని వైఎస్సార్ కూడలి నుంచి పాత బస్టాండ్, పల్లిపేట కూడలి, ఇందిరానగర్ జంక్షన్ మీదుగా విద్యుత్ శాఖ కార్యాలయానికి ర్యాలీ చేశారు.

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి వైఎస్సార్ సీపీ శ్రేణులు సోంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి.
- పలాస నియోజకవర్గ కేంద్రంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు జీఎంఈ కాలనీ నుంచి పలాస ఈఆర్‌ఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.
- ఆమదాలవలస పట్టణంలో పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో పోరుబాట జరిగింది. వన్‌వే ట్రాఫిక్ రోడ్డు నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేశారు. లక్ష్మీనగర్ వీధిలోనుంచి రైల్వే క్వార్టర్స్ వద్ద గల విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని అక్కడ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, పార్టీ కాళింగ సామాజిక వర్గ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు.
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రణస్థలంలోని రామతీర్థాలు కూడలి నుండి రణస్థలం విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.
- పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాట జరిగింది. పంచాయతీ కార్యాలయం వద్ద బస్టాండ్ నుంచి మార్కెట్ మీదుగా ఆల్‌ఆంధ్రరోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.
- టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జంక్షన్, మెయిన్‌రోడ్ మీదుగా విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు.
- శ్రీకాకుళంలో వైఎస్సార్‌సీపీ కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక సూర్యమహల్ కూడలి నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేశారు.



నరసన్నపేట: నిరసన ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్,పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం



జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి తదితరులు

రణస్థలం



విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

టెక్కలి



విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు

ఆమదాలవలస



నిరసన ర్యాలీలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, పార్టీ కాళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు తదితరులు

న్యూస్‌రీల్

నేడు పాలవలస రైల్వే గేటు మూసివేత

సోంపేట: మండలంలోని పాలవలస రైల్వేస్టేషన్ వద్ద రైల్వేగేటుకు శనివారం మధ్యాహ్నం మరమ్మతులు చేపడుతున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజినీర్ టీకే శెట్టి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటు మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, వాహనదారులు విషయాన్ని గమనించాలని కోరారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత వాయుసేన అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించిందని సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. 2025 జనవరి 7 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. టెన్త్/ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పురుష, మహిళా అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాజీ ప్రధానికి నివాళి



సుద్దముక్కపై మన్మోహన్‌సింగ్ రూపం

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ శిల్పి కొత్తపల్లి రమేష్ ఆచారి చాక్ పీస్‌పై ఆయన ప్రతిరూపం అద్భుతంగా చెక్కారు. మూడు గంటల పాటు కష్టపడి ఈ ఆకృతిని తీర్చిదిద్దారు.

– కాశీబుగ్గ

సైకత నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత నివాళులర్పించారు. గాజులకొల్లివలసలోని సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మన్మోహన్ సింగ్ సైకత శిల్పాన్ని రూపొందించారు.

– ఆమదాలవలస



ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను డిసెంబర్ 26వ తేదీ గురువారం నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దీనిపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. తర్వాత జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలి. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం ఇతర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ డేటాపై పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్‌ఐకి నివేదిస్తారు. వీటిని ఆర్‌ఐ పునఃపరిశీలించి తహసీల్దార్‌కు రికమండ్ చేస్తారు. తర్వాత తహసీల్దార్ వీఆర్వో, ఆర్‌ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తారు. వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తారు.

ఆ హృదయం పదిలం



జోగారావు అవయవాల బాక్సును తరలిస్తున్న మెడికవర్ సిబ్బంది

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు
- అవయవదానానికి ఒప్పుకున్న తల్లిదండ్రులు
- శ్రీకాకుళం మెడికవర్‌లో అవయవదానం



కొంకి జోగారావు

అరసవల్లి: కొండంత బాధను గుండెలో పెట్టుకుని ఆ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం బిడ్డను చిరంజీవిని చేసింది. కన్నపేగును కోల్పోయి పుత్రశోకం అనుభవిస్తున్న సమయంలోనూ వారు చూపిన ఔదార్యం మరికొందరు అభాగ్యులకు కొత్త ఊపిరి ప్రసాదించింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కన్నుమూసిన కుమారుడి అవయవాలు దానం చేసేందుకు ముందుకువచ్చి ఆ తల్లిదండ్రులు ఆదర్శప్రాయంగా నిలిచారు. మందస మండల కేంద్రానికి చెందిన కొంకి జోగారావు(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. శుక్రవారం అతని అవయవాలను మెడికవర్ ఆస్పత్రిలో వేరు చేసి చెన్నై, విజయవాడ, విశాఖ నగరాలకు తరలించారు. వివరాల్లోకి వెళితే..



గ్రీన్ చానెల్ ద్వారా వెళ్తున్న అంబులెన్స్

మందస మండల కేంద్రానికి చెందిన జోగారావు విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన మందస–హరిపురం రోడ్డులో జరిగిన ప్రమాదంలో అతడి మెదడుకు గట్టి దెబ్బలు తగిలాయి. జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడు. దీంతో జోగారావు తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, యల్లప్పలు కన్నీరుమున్నీరయ్యారు. అంత బాధలోనూ అవయవదానం ప్రతిపాదనకు ఒప్పుకుని ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు.

తల్లిదండ్రులు అవయవదానానికి ఒప్పుకున్న తర్వాత మెడికవర్ ఆస్పత్రిలో ప్రక్రియ మొదలుపెట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిల ఆదేశాల మేరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వరకు రహదారి పొడవునా ఎలాంటి అవాంతరాలు లేకుండా గ్రీన్ చానెల్ ద్వారా సురక్షితంగా అవయవాలను తీసుకెళ్లేలా చర్యలు చేపట్టారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల వాహనాలు, రెండు ఎస్కార్టు వాహనాలు, అంబులెన్స్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టు వరకు బందోబస్తును కల్పించారు. అక్కడి నుంచి జోగారావు గుండెను చెన్నైకి, కిడ్నీలను విశాఖ, లివర్‌ను విజయవాడలో అవసరమైన రోగులకు అమర్చేందుకు తరలించారు. అంతకుముందే జోగారావు కళ్లను స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధులు సేకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద సిబ్బందితో పాటు స్థానికులంతా జోగారావు తల్లిదండ్రులను అభినందించారు. జోగారావు అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. అవయవదాన ప్రక్రియ పూర్తయ్యాక పార్థివదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక బలగ జంక్షన్ నుంచి బాధిత కుటుంబ సభ్యులు, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలంతా ర్యాలీగా వెళ్లి జోగారావుకు అంతిమ నివాళులర్పించారు.

దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 18వ తేదీ వరకు స్టైఫండరీ కానిస్టేబుల్స్ ఎంపికలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. దీని కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అభ్యర్థుల ఎత్తు, బరువు తెలుసుకోవడానికి సెన్సార్లు ఉపయోగిస్తారు. వీటిలో అర్హత సాధించిన వారికి పీఈటీలో 1600, 100 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పరుగు వేగాన్ని కూడా సెన్సార్ల ఆధారంగా లెక్కిస్తారు. లాంగ్ జంపు మాన్యువల్ పద్ధతిలో తీసుకుంటారు. మహిళల బరువు, లాంగ్ జంప్ మినహా అన్నింటిలో సాంకేతిక పద్ధతులు పాటిస్తారు. రాష్ట్రం యూనిట్‌గా సీసీ కెమెరాల్లో ఎంపిక ప్రక్రియను ఉన్నత అధికారులు పర్యవేక్షిస్తారు.

జిల్లాలో ప్రిలిమినరీ అర్హత పరీక్ష ఉత్తీర్ణత సాధించిన 7390 మంది హాజరు కానున్నారు. వీరిలో పురుషులు 6215 మంది, మహిళలు 1175 మంది ఉన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రి పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లను శుక్రవారం ప్రారంభించారు. రన్నింగ్, జంపింగ్ ట్రాక్‌లు సిద్ధం చేస్తున్నారు. అర్హత సాధించిన వారికి రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు. పురుషులకు సివిల్, ఏపీఎస్పీ, మహిళలకు సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నారు.



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 30 నుంచి జనవరి 18వ తేదీ వరకు నిర్వహించనున్న స్టైఫండరీ కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల కోసం సిద్ధం చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్థానిక పోలీస్ అధికారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. 1600, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ ట్రాక్‌లను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు, అందుబాటులో వైద్య సేవలు, తాగు నీటి సౌకర్యం వంటివి కల్పించాలని సూచించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ శేషాద్రి, ఏఓ గోపీనాథ్, సీఐ అవతారం, ఆర్‌ఐ నర్సింగరావు, ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ ఉన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని, వారిపై లైంగిక వేధింపులు నిరోధించాలని, ఈ చట్టాలపై మహిళల్లో పూర్తి అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో వీధి బాలల భిక్షాటన, మానవ అక్రమ రవాణా, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై జిల్లాలో గల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్, మహిళా పోలీసులతో విద్య ఫౌండేషన్, ఉమెన్ చైల్డ్ ప్రొటెక్షన్, స్థానిక డీసీఈబీలు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలల చట్టాలను వివరించారు. ప్రతి ఒక్క ఆఫీసులో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ కేవీ రమణ, డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శాంతిశ్రీ, విద్యా ఫౌండేషన్ సీహెచ్ ప్రసాదరావు, డీసీపీయూ మెట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన అజయ్‌కుంద బెహరా

నందిగాం: మండలంలోని లట్టిగాం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలోయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం సమీపంలోని ఒడిశా రాష్ట్రం బాసుదేవ్‌పేటకు చెందిన అజయ్‌కుంద బెహరా ఇచ్ఛాపురం నుంచి ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వెళ్తుండగా నందిగాం మండలం లట్టిగాం వద్దకు వచ్చే సరికి కుక్క రావడంతో ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రగాయాల పాలై అపస్మాకర స్థితికి చేరుకోవడంతో గమనించిన స్థానికులు 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆరా తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రున్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అజయ్ కుమార్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

రేపు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్నచౌదరి, కార్యదర్శి అకేన చిరంజీవిరావు శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. క్రీడాకారులు 20 ఏళ్లు మించరాదని, 2005 జనవరి 12 తర్వాత జన్మించి ఉండాలని, బాలురు 70కేజీలు, బాలికల 65 కేజీలలోపు బరువు ఉండాలని స్పష్టంచేశారు. ఎంపికైన జిల్లా జట్లను జనవరి 3 నుంచి 5 వరకు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 77027 42399, 99639 58848 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు



ఫెన్సింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న బలభద్రుని రాజా

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని టౌన్ హాల్ వేదికగా శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్యాడెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు ఎంపికచేశారు. అంతకుముందు ఈ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా ప్రారంభించారు. కాకినాడ వేదికగా ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే రాష్ట్రపోటీల్లో పతకాల పంట పండించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.సుధీర్ వర్మ, వైశ్యరాజు మోహన్, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సంపతిరావు నాయుడు, కోచ్ జోగిపాటి వంశీ, పీడీలు డి.భవానీ, పి.యశోద, అనిత శ్రీ, పీఈటీ జి.రాహుల్, మజ్జి గౌతమ్, అవినాష్, హేమంత్ పాల్గొన్నారు.

ఏఓబీలో హెచ్‌ఐవీ నిరోధానికి కృషి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఎ కార్యదర్శి సన్యాసినాయుడు


శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం –ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఏపీ సాక్స్, డాప్కూ సహకారంతో వీహెచ్ఎస్ సీడీసీ ప్రాజెక్ట్ ఆస్పైర్ సౌజన్యంతో శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం జిల్లాస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆదిలింగం మాట్లాడుతూ ఎన్జీవోల భాగస్వామ్యంతో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎల్ఓ శ్రీకాంత్ మాట్లాడుతూ సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం, పాతపట్నం ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. సమావేశంలో డీఎస్‌పీఎం అపర్ణ, ట్రైనర్ బిందుమాధవి, రెండవ పట్టణ సీఐ ఈశ్వరరావు, శ్రీకాకుళం ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ బీసీహెచ్ అప్పలనాయుడు, ఐసీడీసీ ప్రాజెక్ట్ ఆస్పైర్ జాన్ మత్తయా, డీఆర్‌పీ నాగభూషణ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మోసం కేసులో ఐదుగురిపై కేసు

ఎచ్చెర్ల క్యాంపస్: తప్పుడు డెత్ సర్టిఫికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలతో తన భూమిని కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని విశాఖపట్నానికి చెందిన నల్లగొర్ల సరోజినీదేవి అనే మహిళ ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కుశాలపురం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఈ ఆక్రమణ జరిగిందని పేర్కొన్నారు. బగాది సుశీల, మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సందీ ప్‌కుమార్ చెప్పారు.

ఒడిశా సారా.. పట్టుకోలేరా..?

- 'హద్దులు' దాటుతున్న సారా విక్రయాలు
- ఒడిశా నుంచి ఆంధ్రా గ్రామాల్లోకి రవాణా
- సరిహద్దు గ్రామాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



సారా బట్టీ(ఫైల్)

కొత్తూరు:

ఒడిశా రాష్ట్రంలో తయారవుతున్న నాటుసారా ఆంధ్రా పల్లెల్లోకి దర్జాగా చేరుతోంది. ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల మీదుగా ప్యాకెట్ల రూపంలో విచ్చలవిడిగా రవాణా అవుతోంది. కొత్తూరు మండలంతో పాటు జిల్లాలోని ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఏరులై పారుతోంది. ఎక్సైజ్ శాఖ పోలీసులు జిల్లాలో సారా బట్టీలపై తరచూ దాడులు నిర్వహిస్తూ తయారీదారులు, విక్రయదారులను పట్టుకుంటున్నా ఒడిశా సారాను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. ఎక్కడికక్కడ ఒడిశా సారా లభ్యమవుతుండటంతో మద్యం అమ్మకాలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇదీ పరిస్థితి..

ఒడిశా రాష్ట్రంలో సరిహద్దు గ్రామాల పరిధిలో సారాబట్టీలు ఎక్కువ. అక్కడ తయారైన సారాను ఆంధ్రా సరిహద్దు గ్రామాలకు ఆటోలు, కార్ల ద్వారా తరలిస్తున్నారని సమాచారం. వారంలో మూడు రోజులు ప్రధానంగా హడ్డుబంగి బట్టి నుంచి 10 వేలు నుంచి 15 వేలు సారా ప్యాకెట్లు ఇలా రవాణా చేస్తున్నట్లు తెలిసింది. కొత్తూరు మీదుగా పార్వతీపురం మన్యం జిల్లా బాలేరు తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. ప్రతివారం ఇంత పెద్దమొత్తంలో ఒడిశా సారా ఆంధ్రాలోకి వస్తున్నా పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం. కొత్తూరు మండలంలోని నివగాం, దిమిలి, రాయల, మాకవరం, మాతల, పొనుటూరు, కుద్దిగాం, బలద, కడుము, మదనాపురం తదితర గ్రామాల్లో సాయంత్రం అయ్యే సరికి మందుబాబులు ఒడిశాలోని హడ్డుబంగితో పాటు మండలానికి ఆనుకొని ఉన్న పలు ఒడిశా గ్రామాలకు వెళ్లి నాటుసారా తాగుతుంటారు. వచ్చేటప్పుడు కూడా కొన్ని ప్యాకెట్లు తీసుకొచ్చి గ్రామాల్లో రహస్యంగా విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో సారా అరికట్టడంలో తలమునకలైన ఎక్సైజ్ పోలీసులకు ఈ ఒడిశా సారా మరింత తలనొప్పులను తెచ్చిపెడుతోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి ఒడిశా సారా రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చింది..



ఒడిశా రాష్ట్రం హడ్డుబంగి ఓఎస్ నుంచి కొత్తూరు మీదుగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బాలేరు, ఇతర గ్రామాలకు సారా అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అక్రమ రవాణా అరికట్టేందుకు సరిహద్దు గ్రామాల్లో నిఘాం పెట్టాం. – కిరణ్ మణీశ్వరి, సీఐ, ఎక్సైజ్ స్టేషన్, కొత్తూరు మండలం

తీర్థయాత్రలకు వెళ్లి మృత్యువాత



రాముడు(ఫైల్)

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన వనుము రాముడు(58) తీర్థయాత్రలకు వెళ్లి తమిళనాడు రాష్ట్రం వెల్లూరులో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. ఈ నెల 23న సీతారాంపురం నుంచి 42 మంది భవానీ భక్తులు దీక్షలు విరమించేందుకు విజయవాడ వెళ్లారు. అక్కడి నుంచి పలు పుణ్యక్షేత్రాలు సందర్శించి కంచి మీదుగా వెల్లూరు వెళ్లారు. వెల్లూరులో గురువారం మధ్యాహ్నం వంట చేసేందుకు బస్సు నిలపగా రాముడు అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి భక్తులు వెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మృతి చెందాడు. రాముడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తీర్థయాత్ర మధ్యలో ఇలా జరగడంతో తోటి భక్తులు విషాదంలో మునిగిపోయారు. రాముడు నిరుపేద కావడంతో చందాలు వేసుకుని అక్కడి నుంచి మృతదేహాన్ని సీతారాంపురం తీసుకొస్తున్నారు.

బ్యాంకు రశీదులు ఫోర్జరీ!

- ఎస్‌హెచ్‌జీ సంఘాల సీఏఫ్ చేతివాటం
- విషయం బహిర్గతం కావడంతో సద్దుమణిగించే ప్రయత్నాలు

టెక్కలి: టెక్కలి మండలం వెలుగు స్వయం సహాయక సంఘాల సీఏఫ్ చేతివాటం ప్రదర్శించి ఏకంగా బ్యాంకు రశీదులను ఫోర్జరీ చేసిన ఘటన వెలుగుచూసింది. తన పరిధిలో వివిధ స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి ప్రతి నెలా బ్యాంకుకు చెల్లించాల్సిన రుణం డబ్బులను బ్యాంకులో జమ చేసినట్లు ఫోర్జరీ రశీదులను సభ్యులకు చూపించి ఆ నగదును సొంత అవసరాలకు వాడుకున్నాడు. ఇటీవల బ్యాంకు సిబ్బంది విషయాన్ని తెలుసుకుని వెలుగు అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఈ వివాదాన్ని సద్దుమణిగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రాథమికంగా తెలిసిన సమాచారం మేరకు.. టెక్కలి మండలం గూడేం పంచాయతీ పరిధిలో సుమారు 40 స్వయం సహాయక సంఘాలకు ఓ సీఏఫ్ ఉన్నారు. కొన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు టెక్కలి యూనియన్ బ్యాంకుకు నెలవారీ చెల్లించాల్సిన రుణం వాయిదాలను సీఏఫ్‌కు అందజేసేవారు. సదరు వ్యక్తి వాయిదాలు చెల్లించినట్లు కొన్ని రకాల ఫోర్జరీ రశీదులను సభ్యులకు అందజేస్తూ వచ్చాడు. ఇటీవల ఎస్‌హెచ్‌జీ సభ్యులు రుణం వాయిదాలు చెల్లించడం లేదని బ్యాంకు సిబ్బంది సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. దీంతో బ్యాంకు అధికారులు వెలుగు సీసీ శ్రీరాములు దృష్టికి తీసుకువెళ్లారు. ఫోర్జరీ బాగోతం వెలుగుచూసినా దర్యాప్తు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై వెలుగు సీసీ శ్రీరాములు వద్ద ప్రస్తావించగా.. ఎస్‌హెచ్‌జీ సంఘాల రుణ వాయిదాలకు సంబంధించి ఫోర్జరీ రశీదుల విషయం తన దృష్టికి వచ్చిందని, గ్రామ స్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

పాఠశాలల అభివృద్ధికి బాసటగా నిలవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగంలో కీలకంగా ఉండే పాఠశాలల సమగ్రాభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ భాగస్వాములు కావాలని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్ కోరారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఇటీవలి ఎన్నికైన యాజమాన్య కమిటి సభ్యులకు శుక్రవారం శ్రీకాకుళం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. ఇటీవల కాలంలో పాఠశాలల ప్రాంగణాలను అసాంఘిక శక్తులు నాశనం చేస్తున్నాయన్నారు. మత్తుపదార్థాలు సేవించే పరిస్థితులు ఏర్పడుతున్నందున వాటి నిర్మూలనకు కలిసికట్టుగా పోరాడాలన్నారు. అనంతరం 'మత్తుపదార్థాల నిర్మూలన'నకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్, విద్యాశాఖ, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

● డ్రోన్ నిఘాలో నగరం



నాగావళి నదీ పరీవాహక ప్రాంతంలో..

జిల్లాకేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారి పనిపట్టేందుకు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలపై డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమీపంలోని డచ్ బంగ్లా, గుడివీధి, కంపోస్టు కాలనీ, అరసవల్లి, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలు, పాడుబడిన బంగ్లాలు, నివాసగృహాలను డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. – శ్రీకాకుళం క్రైమ్



డ్రోన్ ఎగురుతోందిలా..



కంపోస్టు కాలనీలో..

సాఫ్ట్‌బాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా కూన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రవికుమార్ నియామకంపై ఏపీ సాఫ్ట్‌బాల్ సీఈఓ సి.వెంకటేశులు, నర్సింహారెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మిదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్, పేడాడ బాబూరావు, గురుగుబెల్లి రాజశేఖర్, సంఘ ప్రతినిధులు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు, హర్షం వ్యక్తం చేశారు.

పీజీ, స్పెషల్ బీఈడీ సెమిస్టర్ పరీక్షలకు నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సైన్స్, ఆర్ట్స్, అఫిలియేషన్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, వర్సిటీలోని బీఎడ్ మెంటల్లీ రిటార్డు కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం తెలిపారు. జనవరి 20లోపు ఫీజు చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుముతో జనవరి 23లోపు, రూ.2000 అపరాధ రుసుముతో 25వ తేదీలోపు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 25వ తేదీ నుంచి ప్రయోగాలు ప్రారంభమవుతాయని తెలిపారు. జనవరి 29 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30, పరీక్ష ఫీజు రూ.770, ప్రయోగ, ప్రాజెక్టు, వైవా, ఫీల్డ్ వర్క్ ఫీజు రూ.250 కలిపి మొత్తం రూ.1050 చెల్లించాలని సూచించారు. ఇతర విశ్వవిద్యాలయాల పరిధిలోని విద్యార్థులు రూ.300 మైగ్రేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులు గడువు లోగా ఫీజులు చెల్లించాలని సూచించారు.

దూసుకొచ్చిన ఇసుక లారీ



శ్రీహరిపురం వద్ద ప్రమాదానికి గురైన లారీ

ఆమదాలవలస: మండలంలోని శ్రీహరిపురంలో ఆలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై గురువారం రాత్రి అధిక బరువుతో ప్రయాణిస్తున్న ఇసుక లారీ అదుపు తప్పికిరాణాషాపు వైపు దూసుకెళ్లింది. ఆ సమయంలో షాపు మూసి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ర్యాంపు నుంచి పార్వతీశ్వరునిపేట వైపు వెళ్లాల్సిన లారీ పొరపాటున ఆమదాలవలస పట్టణం వైపు దారి తెలియక తీసుకురావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడం, వెంటనే టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. లారీకి అనుమతులు కూడా లేనట్లు సమాచారం. తరచూ అధిక లోడు ఇసుకతో లారీలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న డీపీఎం మోహనరావు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామస్థాయిలో స్వయం సహాయ సంఘాలు బలోపేతం కావాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్, రిసోర్సుపర్సన్ మోహన్‌రావు అన్నారు. కమ్యూనిటీ బేస్ట్ ఆర్గనైజేషన్‌లో సబ్ కమిటీల పాత్రపై ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఏసీలు, ఏపీఎంలు, సీసీల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా మహిళలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు, మండల ప్రాజెక్టు మేనేజర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రహరీని ఢీకొట్టిన గ్రానైట్ లారీ

- తప్పిన పెను ప్రమాదం



గోడపై పడిన గ్రానైట్ లారీ

కాశీబుగ్గ: గ్రానైట్ రాయితో వస్తున్న లారీ అదుపు తప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీని ఢీకొట్టింది. రాత్రి వేళ ఈ ప్రమాదం జరగడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి అదే రాష్ట్రం గారబంద గ్రామానికి గ్రానైట్ లారీ మందస రోడ్డు మీదుగా ప్రయాణిస్తుండగా.. మందస పీహెచ్‌సీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చేందుకు పక్కకు వెళ్లింది. ఆ సమయంలో బరువు తట్టుకోలేక పీహెచ్‌సీ ప్రహరీపై ఒరిగిపోయింది. అర్ధరాత్రి కావడంతో వైద్య సిబ్బంది, రోగులు ఆ ప్రాంగణంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మందస పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

జిల్లా మలేరియా విభాగానికి ఫాగింగ్ యంత్రాల వితరణ



డీఎంహెచ్‌వోకు యంత్రాలను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అరసవల్లి : మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు కారణమైన దోమలను నియంత్రించేందుకు జిల్లా మలేరియా విభాగానికి 50 ఫాగింగ్ యంత్రాలను రెడ్డీస్ ఫౌండేషన్ సంస్థ అందజేసింది. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఈ యంత్రాలను వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ కె.వి.ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ గతంలో జిల్లాలో 17 పీహెచ్‌సీలను ఆధునీకరించేందుకు పనులు చేపట్టామని, ఇప్పటి వరకు 15 పీహెచ్‌సీల పనులు పూర్తి చేసినట్లు వివరించారు. సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ ఫౌండేషన్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి, మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒడిశా ధాన్యం సీజ్



కంచిలి: ఒడిశా సరిహద్దు నుంచి ఎటువంటి పత్రాలు లేకుండా వ్యాన్ ద్వారా వస్తున్న ధాన్యం లోడ్‌ను శుక్రవారం జక్కర గ్రామం వద్ద స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే సీఎస్‌డీటీ పి.కూర్మారావుకు సమాచారం అందించారు. చాలా కాలంగా సాగుతున్న ఈ తంతును స్థానికులు గమనించి చివరికి జక్కర గ్రామం వద్ద లోడుతో వెళ్తుండగా పట్టుకున్నారు. 80 కిలోలు చొప్పున మొత్తం 140 బస్తాలు ఉన్నాయని, వీటిని సీజ్ చేశామని సీఎస్‌డీటీ కూర్మారావు తెలిపారు. వీటిని కంచిలిలో సుందరం ట్రేడర్స్ మిల్లు వద్ద దించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

బొల్లినేని మెడిస్కిల్స్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సీహెచ్ నాగేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావుకు కిట్స్ ఫౌండేషన్ తరఫున ఉత్తమ భాగస్వామి శిక్షణ కేంద్రం అవార్డు లభించింది. అమెరికాలోని రాట్‌గర్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో యువత నైపుణ్యాభివృద్ధికి తమ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారని చెప్పారు. ఇప్పటికే వేలాదిమంది నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. తమ సేవలను గుర్తించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, కిట్స్ చైర్మన్ డి.వి.గిరిధర్, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న రాజేంద్రబాబు

నరసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర యువజన విధానాన్ని ప్రకటించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఏ హామీలు ఇచ్చారో వాటిని కచ్చితంగా అమలు చేసి తీరాలన్నారు. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం నరసన్నపేటలో సభ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పరిశ్రమలు ఏర్పాటు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు నెలవారీ నిరుద్యోగ భృతి కల్పిస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తున్న 22వ ఏఐవైఎఫ్ రాష్ట్ర సభలు విజయవంతం చేయాలని కోరారు. ఈయన వెంట రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలకు అభినందనలు



జిల్లా కబడ్డీ క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రపోటీల్లో సాధించిన పోరాటస్ఫూర్తితో జాతీయ పోటీల్లోనూ సత్తాచాటాలని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగిన 50వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలుగా నిలిచిన విషయం తెలిసిందే. జిల్లాకు వచ్చిన క్రీడాకారులను, కోచ్‌లను, ప్రోత్సహిస్తున్న కబడ్డీ సంఘ బాధ్యులను శుక్రవారం స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, డీఎస్ఏ కబడ్డీ కోచ్ సింహాచలం, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు వర్సిటీ, కళాశాలలకు సెలవు

ఎచ్చెర్ల క్యాంపస్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల పరిధిలో శనివారం సెలవు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే వర్సిటీలో క్లాస్‌వర్కుకు సెలవులు కొనసాగుతుండగా, పాలన విభాగానికి కూడా ఈ సెలవు వర్తిస్తుంది.